దయచెయ్యండి దయచెయ్యండి
సాధారణ సంవత్సరం గారూ
దయచెయ్యండి
వద్దంటే మానేస్తారు గనుకనా
వచ్చేశారుగా ఎలాగూ
అంచేత అందుకోండి స్వాగతం
సహజంగా వచ్చేసిన వచ్చేసిన
సాధారణ సంవత్సరం గారూ
స్వాగతం సుస్వాగతం మీకు
గుడ్ మార్నింగ్ సాధారణ గారూ
గుడ్ మార్నింగ్ గుడ్ మార్నింగ్
(ఈ ఉదయంలో ఏ గుడ్డూ లేకపోయినా)
గుడ్ మార్నింగ్
సాధారణాఖ్య సంవత్సరం గారూ
అదేమిటి అంత బస్తా తెచ్చారు
అందులో ఏముంది
బహుశా సామ్యవాదం కాదుకదా!
కాదనే అనుకుంటాను
పెట్టుబడిదారులు బెంగ పెట్టుకోనక్కరలేదు
సాధారణ పరిస్థితులు సామ్యవాదాన్ని
తీసుకు రాలేవు.

కాలం ఇంకా కళపెళా ఉడకాలి
సరియైన వంటవాళ్లు దొరకాలి
సాధారణ బస్తాలో సామ్యవాదం లేదు
అయితే మరేముందో చెప్పండి?
సాధారణ సంవత్సరం గారూ
అరే, నన్నే చెప్పకో మంటున్నారా?
సరే ప్రయత్నిస్తాను
ఆ బస్తాలో మున్నూట అరవైకి తక్కువ కాని
రోజులున్నాయి.

రైటేనా! రైటు
కాని, రోజుకి ఇరవయి నాలుగే గంటలు
రైటేనా? డబుల్ రైట్
రోజూ సూర్యుడు దక్షిణాన ఉదయించి
ఉత్తరాన అస్తమిస్తాడు
తప్పు తప్పు ఏదో ఆలోచిస్తూ ఏమిటో అనేశాను
ఎప్పటి లాగే సూర్యుడు
తూర్పున ఉదయించి పడమటనే అస్తమిస్తాడు
ఏదుగుడు చిట్కాలెన్ని ప్రయోగించినా
జనాభాలు
తరగడానికి బదులు పెరుగుతూనే ఉంటాయి
అది మృత్యువు మీద జీవితానికి విజయం
ఏదీ ఆ బస్తా ఇటు ఇవ్వండి
రాజ పూజితం ఎంతో
అవమానం ఎంతో చూస్తాను
అనవసరం అంటారా
అయితే మానేస్తాను.

అదేమిటి ఆ కన్నంలోంచి అంత స్పష్టంగా
కనిపిస్తోంది — సిగ్గుసిగ్గు
సెన్సారులారా పారా హుషార్
పిలుగుడ్డలో అలుగుడ్డలో వేసి ఆచ్ఛాదించండి
ఐలె ఐలె
ఎక్కడ తడిమితే అక్కడే తగులుతున్నాయి
రాజకీయాలు
వాటితో బాటే మాయోపాయాలు
వచ్చే రాములూ పోయే రాములూ
తెచ్చిపెట్టే మారాములు.
క్షమించండి సాధారణ గారూ
మీ అనుమతిస్తే బస్తాలో చెయ్యిపెట్టి చూస్తాను.
థాంక్స్! ఇందులో ఏవేవో బోలెడు పొట్లాలున్నాయే
ఏదో ఒక్కటి మాత్రం బైటికి తియ్యమన్నారా
ఇదిగో ఇది మిఠాయి పొట్లం
నిరుటి దిన పత్రికలో కట్టిన ఆంధ్ర సాహిత్యం.
ఇలా చమురోడుతోం దేమిటి
ఉత్త నూనె మిఠాయిలాగుందే
ఏమిటి ఖాజా
పాత భావాల సంపాదకీయం
ఈనాటి ఆంధ్ర సాహిత్యం అంతా ఇంతేనా
ఖాజాలూ — పోజులేనా
కాదుకాదు ఇంకో మంచి పొట్లం ఉందంటావా!
ఉండాలి, ఉండి తీరాలి
సచేతనంగా యువతరం సంస్పందిస్తోంది
ఆరోగ్యకరమైన ఆహారం అందిస్తోంది
తిరుగుబాటు గాలులు పిలుస్తూ పెరుగుతోంది
విరాడంబరంగా దిగంబరంగా తిరుగుతోంది
ఈలోగా నేను చక్కని మన
సంప్రదాయాన్ని మన్నిస్తూ
ఉడిపి హోటేల్లో ఉగాది పచ్చడి సేవిస్తాను
• • •

అరే ఇంకా ఇక్కడే ఉన్నారా
సాధారణ గారూ
అన్నట్టు పీడాది దాకా ఇక్కడే ఉంటారుగా
ఎలాగుంది ఉగాది పచ్చడి అని అంటారా
ఓ ఛమగ్గా ఉంది
పత్రిక పొట్లంలోని పాత సాహిత్యంకన్నా
బాగానే ఉంది.

కొంచెం తియ్యగా ఉంది.
చాలా చేదుగా ఉంది.
మొత్తంమీద మన జీవితాల్లాగే ఉంది.
అదిగో ఎదురుగా అద్దం
అందులో నా మొగం చూసుకుంటే
తప్పు ఒప్పులు చాలా తేడగా కనిపించాయి.
అయినా ఉడిపి హోటేల్లో పచ్చడి తిన్నాను

(తరువాయి 63 వ పేజీలో)

## సాధారణ ఉగాది పచ్చడి

(7 వ పేజీ తరువాయి)

లేక కాఫీ తాగేనా?
షికరి పొడరు చేదుతోకూడిన
పాక్టరి పంచదార కలిపిన
పరమ పవిత్రమైన కాఫీ దిగమింగి
అదే ఉగాది పచ్చడి అనుకున్నానా
అందుకే కాబోలు నా మొగం అలా కనిపించింది
గోడ మీద నెహ్రూ ఫోటో ఉంది
"జీ! నీ మొగం నా మొగంలా ఉం"దన్నాను
అదే చిరునవ్వు అదే ఆవేదన
సాధారణ బస్తా చూస్తుంటె
ఎవరిలోనైనా ఇవే కనిపిస్తాయి.
శ్రీమతి సాధారణ గారూ
మీ సెక్సు స్పష్టమే కానీ
ఉన్న దొక్కటే చిన్న అనుమానం
మీరు శ్రీమతి సాధారణ గారా
కుమారి సామాన్య గారా అని! ఫర్వాలేదు
సాధారణలే అసాధారణ లవుతారు
సామాన్యలే అసామాన్యలవుతారు
ఇతి శుభం! (ఆకాశవాణి సౌజన్యంతో)

---

భవానీ గారి 'రక్తపు కూడు' వర్ణనంతో ఆకర్షించింది. 'రక్తపు కూడు' చదివిన ప్రతి మనిషిని కదిలించక పోదు. జానకమ్మలాంటి త్యాగమయి అయిన సవతితల్లి లాంటి వారు ఈ విశాల ప్రపంచంలో ఉండటం మాత్రం చాలా అరుదు. శాంతి ఎదుర్కొన్న పరిస్థితినే తారామంది ఈ నాటి అబలలు ఎదుర్కొని అన్యాయంగా బలిగిపోతున్నారు.

—లలితా భవాని (సికిందరాబాదు)

* * *

8—4—70 వ తేదీ సంచికలోని కథలలో ముఖ్యంగా 'స్వార్థం కోరిన బలి' కథ చక్కటి వర్ణనంతో కూడుకొని ఉంది. స్వార్థం మనిషిని ఎంతటి పని కయినా చేయిస్తుంది. ఆ స్వార్థంలో మిగతావారిని లెక్కచేయకుండా కేవలము తనకొరకై పాటుపడు తుంటాడు. "తనకు కానిది కావాలనుకున్న స్వార్థంతో ఇతరుల హృదయాలను క్షోభపెడితే ఆ ఉసురు ఊరికే పోదు" అన్న వాక్యం అబద్ధం కాదు.

ఎంతో ఆసక్తిగా నడుస్తున్న సీరియల్ 'వింత హృదయాలు' లోని కుమార్, విజయలు ఇంత దగ్గిరగా ఉన్నా ఒకరి నొకరు కలుసుకోలేక పోతున్నారు. కాని రచయిత కేవలం ఇది ఒక తెలుగు సినిమాలా అందరిని ఒకే హాస్పిటల్‌లో కలుపుతున్నారు. ఈ ఒక్క విషయంలో తప్ప మిగతా ఇతివృత్తం బావుంది.

తరువాతి 'సంపాదకీయం', 'మాణిక్యవీణ'లు మామూలు రూపంతో ఉన్నాయి.

—ఎస్. యుగంధర్ (కరీంనగర్)

* * *

8—4—70 వ తేదీ సంచిక ముఖచిత్రం 'జయలలిత' చాలా అందంగా ఉంది. సీరియల్ 'వింత హృదయాలు', 'స్వార్థం కోరిన బలి', 'రక్తపు కూడు' కథలు ముఖ్యంగా నాకు బాగా నచ్చాయి.

—వి. రామకృష్ణ (బొంబాయి—12)

* * *

8—4—70 వ తేదీ సంచికలో ప్రచురించిన 'రక్తపు కూడు' కథ చాలా బాగున్నది. చదువుతున్నంత సేపూ కళ్ళమ్మట నీరు వచ్చింది. 'రక్తపు కూడు' కథ హృదయాన్ని కదిలించేసింది. 'వింత హృదయాలు', 'మిథ్య' సీరియల్స్ చాలా బాగున్నవి. 'రక్తపు కూడు' కథలో శాంతి రంగయ్య తాత ఉత్తరం చదవగానే చనిపోయి ఉంటే కథ ఇంకా చాలా బాగుండేది.

—సి. నాగమణి (విజయవాడ)

* * *

'రక్తపు కూడు' కథ చదువుతుంటే చాలా విచారం కలిగినది. జానకి పాత్ర మరువరానిది.

వై. వరలక్ష్మిగారు వ్రాసిన 'స్వార్థం కోరిన బలి' సహజముగా ఉన్నదని నా అభిప్రాయం. చదువు కున్న డాక్టరు పిల్లలు లేరని చింతతో సదుద్దేశ్యముతో తీసుకెళ్ళి పిల్ల మరణానికి కారకుడగుట చాలా బాధ కలిగించింది.

'అన్వేషి'గారు వ్రాసిన 'దుక్కిటెద్దు' కథ చాలా బాగున్నది. జీవితం అంతా కష్టపడి నిర్వాకంచేసి పిల్లలు, భార్యమీద మమకారం చంపుకొనలేక రిటైరయిన సీతారామయ్యను భార్య ఇంకా ఉద్యోగం ఎక్స్‌టెన్షన్ చేసుకోమని అడుగుట, కొడుకు తండ్రికి రావలసిన డబ్బుమీద దృష్టి తప్ప అభిమానంగా ఇంటికి వచ్చినప్పుడు ఎవ్వరూ ఉండకపోవుట నేటి వాస్తవికతతో కూడి ఉన్నది.

—కూచిభొట్ల సీతామహాలక్ష్మి (రాజమండ్రి—1)

* * *

ఈ వారం ప్రభ (8—4—70 లో) ముఖ చిత్రం 'జయలలిత' చాలా ఆకర్షణీయంగా ఉంది. 'మిథ్య', 'వింత హృదయాలు' సీరియల్స్ వింత వింత మలుపులతో పరుగులిడుతున్నాయి. 'మిథ్య'లో హరికృష్ణ, 'వింత హృదయాలు' లో రాజ్యలక్ష్మి పాత్రలు బావున్నాయి.

—ఎమ్. మురళీ ఆండాళు (తిరువూరు)

* * *

ఈ వారం ఆంధ్రప్రభ వీక్లీ ముఖచిత్రం సర్వాంగ సుందరంగా ఉంది. నా అభిమాన నటి 'జయలలిత'ను వేసినందుకు థాంక్స్.

విశ్వంగారి 'మాణిక్యవీణ' ప్రభకు హైలైట్. 'వింత హృదయాలు' సీరియల్ మా హృదయాలను ఆకట్టుకొంటూంది. ఉగాది ప్రత్యేక సంచికకోసం ఎదురుచూస్తున్నాను.

—నాగుబడి బాపయ్యచౌదరి (నిజామాబాద్)

* * *

లెక్కలలో విచిత్రాలు

1—4—70 సంచికలో పై శీర్షిక క్రింద ప్రసాదరావుగారు 3 తమాషాలు రాశారు. కాని, మూడవ తమాషా, 'మీ స్నేహితుడు కొట్టివేసిన సంఖ్య చెప్పడం'లో ఒక లోటు ఉన్నది. వచ్చిన సంఖ్యలో '9' అంకె కొట్టివేస్తే, ఆ అంకెను చెప్పడం కష్టం.

ఉదాహరణకు:

స్నే: వ్రాసిన సంఖ్య,—398645 అనుకొందాం.

అంకెల మొత్తం — 35 అవుతుంది.

అంకెల మొత్తం తీసివేస్తే 398610 వస్తుంది.

ఆ సంఖ్యలో '9' అంకె స్నేహితుడు కొట్టివేశాడు అనుకొందాం. మిగతా అంకెల మొత్తం 18 అవుతుంది. అప్పుడు జాబితాలో గల '18' సంఖ్యకు, అంకెల మొత్తం '18' దగ్గిర సంఖ్య అవుతుంది. జాబితా సంఖ్య (18) లో అంకెల మొత్తం (18) తీసివేస్తే శేషం '0' మాత్రమే. అందుచేత మనం స్నేహితుడు కొట్టివేసింది సున్న అని చెప్పగలం.

పైన చెప్పినట్లు తప్పు చెప్పకుండా ఒక ఉపాయం ఉంది. మొత్తం సంఖ్యలో '9' అంకెను మాత్రం కొట్టకూడదు అని షరతు పెట్టాలి.

ఇంకోలాగ కూడా అవుతుంది. సున్న అంకె కొట్టకూడదు అని షరతు పెట్టుకుంటే, శేషం సున్నా వచ్చినప్పుడు 9 అని చెప్పుకోవాలి.

—కె. వి. రమణ (జయపూర్)

* * *

11—3—70 వ తేది ఆంధ్రప్రభలోని కథలన్నీ చదివాను. ముఖ్యంగా 'అక్కయ్య', 'ప్రశాంతి' బాలా ఇంతో బాగున్నవి. 33 వ పేజీలోని 'వర్ణచిత్రం' చూడముచ్చటగా ఉన్నది.

సీరియల్ 'వింత హృదయాలు' నిజంగా నా హృదయాన్ని కదిలించివేయుచున్నదండీ. . .

—బందిగాను మణిమోహన్‌కృష్ణ (హైదరాబాద్—1) ★